# నళినీ లవ్‌స్టోరీ

ఇది నళిని కథ. నళిని గురించి చెప్పేముందు వంట వూసెత్తాలి. ఎందుకంటే వంట అన్నాకా, కథ అన్నాకా, ఉప్పుతో తొమ్మిదీ, పప్పుతో పదీ చూసుకోవాలి కదా! కాని యిదేమిటి? అని కథానాయిక నళినిని నిలదీశారనుకోండి-ఆ పిల్ల చెప్పలేదు. ఎందుకంటే, వారపత్రికలో ఆవారా, ఈవారా పడే వంటా వార్పూ శీర్షికల్ని నళిని ఖాతరు చెయ్యదు. సీరియల్స్, కథలు, మాత్రం సీరియస్‌గా చదివి, సినిమా బొమ్మలు చూసి పత్రికల్ని అవతల పడేస్తుంది.

సుబ్బారావు ఇన్నోసెంట్ కాదుగానీ, యిగ్నోరెంట్ ఫెలో. సుబ్బారావు మొదట్నుంచీ చురుకైన వాడు. వాళ్ళమ్మ వెనక అదీ యిదీ సాయం చేస్తూ, చిన్నప్పుడే వంట నేర్చుకున్నాడు! మరీ ఏడో ఏటా మూడో క్లాసూ, పదో ఏట ఏడోక్లాసూ చదువుకున్నాడు. ప్రస్తుతం పెద్దవాడై-పట్టభద్రుడై, ఆ డిగ్రీ కాయితాన్ని భద్రంగా పటం కట్టి గోడకి వ్రేలాడగట్టాడు!

అలాగే మొన్న నామధ్య వాళ్ళమ్మా, నాన్నగారు కూడబలుక్కొని తిరుపతిలో అని చెప్పి, సలక్షణంగా తిరుచానూరులో ఉపనయనం చేసి, మూడు పోగుల జందెం వేసి, దీవిస్తే, "అత్రేరీ! యిరవై రెండు సంవత్సరాల, ఎనిమిది మాసాల తొమ్మిది రోజుల పెళ్లీడు వాడికి మూడు పోగులేనా వేస్తారూ!" అంటూ బాధపడ్డట్లు-ఆ జందెం ముక్కను కాస్తా "పట్టా"కోసం గోడకి కొట్టిన మేకుకే తగిలించేశాడు అంటే పెళ్ళికీ, ఉద్యోగానికీ కూడా సుబ్బారావ్‌కి అర్హత వచ్చేసిందన్నమాట!

సుబ్బారావ్ "డిగ్రీ"కి కాపీతీసి పోస్టులో పంపంగానే ఆడపిల్లలెక్కువగావున్న తండ్రి అల్లుణ్ణి కొల్చుకుని, చూసుకునీ చెయ్యకుండానే పిల్లనిస్తానని వచ్చినట్లు ఓ కంపెనీవాళ్ళు అర్జెంటుగా తిరుగుటపాలో ఉద్యోగం యిచ్చేశారు. ఇందులోగల అసలు రహస్యం వాళ్ళ నాన్నకి తప్ప రెండో కంటికి ఆ ఇంట్లో తెలియదు.

సుబ్బారావుకి ఎగిరి గంతేసినంత సంతోషంవేసి ఎగిరి గంతేశాడు కూడా! కానీ ఏం చేస్తాం? అంతెగిరినా ఆఖరికి నట్టింటి గుమ్మంకూడా నెత్తికి తగల్లేదే, ఇలాంటి పసివాణ్ణి, పట్నం ఉద్యోగానికెలా పంపనూ?" అని వాపోయింది వాళ్ళ అమ్మ. కాని వాళ్ళ నాన్నగారు మాత్రం ఈ విషయంలో కాస్త కోప్పడ్డాడు. "ఆ యీడుకి నేనూ, నువ్వూ వాణ్ణి ఎత్తుకుని ఆడించాం. పైగా, ఎన్నాళ్ళేం? ఒంటిరెక్క

బ్రతుకు-వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు అని నాకు నాలుగు రాళ్ళు-వాడికి కాస్త లోకానుభవం రావాలి'' అంటూ సుబ్బారావుని రైలెక్కించేశాడాయన.

వాళ్లమ్మ ప్రేమగా ఒక అరబస్తా దంపుడు బియ్యం, ఒక మణుగునెయ్యి, ఒక బుట్టనిండా నీరుల్లిపాయలు (వెల్లుల్లిపాయలంటే సుబ్బారావుకి పరమ అసహ్యం) ఒక జాడీలో పాత గూనల్లోంచి ప్రత్యేకంగా తీసిన ఊట ఆవకాయ (వెల్ళుల్లిపాయలు వేయనిది) ఇంకా కాసిన్ని మినపసున్ని వుండలు (అవి అంటే సుబ్బారావు చెవి కోసుకుంటాడని వాళ్ళమ్మకి మాత్రమే తెల్సు) గట్రాతో రైలెక్కించేసింది. దంపుడు బియ్యం వద్దనీ, అక్కడ పట్నంలో వండి పెట్టగల వంటవాళ్లు-సుబ్బారావుకి ఫలానీ కంపెనీవారిచ్చే జీతం కంటే మరో పాతిక ఎక్కువిస్తేనేగాని దొరకరని నమ్మించి, వాళ్ళ నాన్న ఆ అరమూట బియ్యం దించేశాడు. సుబ్బారావుని రెక్కపట్టుకొని రైలెక్కించేశాడు కూడా!

పట్నంలో సుబ్బారావు 'కథానాయకుడు'లా దిగాడు. అతనితోపాటు ఆవకాయా, ఆవునెయ్యీ దిగాయి. సుబ్బారావుగారింట్లో గేదెలు మాత్రం గలవు. కానీ, సుబ్బారావు కోసమని ఆవునెయ్యి ప్రత్యేకంగా కొంటారు. అలా దిగిన సుబ్బారావు ఎక్కడికి పోతాడు? అలా వుండనిద్దాం. నళిని సంగతి చూద్దాం...

నళినికి వాళ్ళ బామ్మ అంటే కోపం. బామ్మకి నళిని అంటే యిష్టం. ముఖ్యంగా నళిని ఒక్క జెడమాత్రం వేసుకోడం ఆవిడకి మరీ యిష్టం. 'సవరంపెట్టుకొని యించక్కా పొడుగ్గా బారెడు జెడ అల్లుకోవే అమ్మా'' అంటుందావిడ. పొట్టిగా, వొత్తుగా పెరిగిన కేశ సంపద కలిగిన మనుమరాలికి మాత్రం రెండు జడలు-అదీ తన నిజం జుట్టుతోనే వేసుకోడం యిష్టం. కొసలు వెడల్పుగా అట్ల కాడల్లా వుండాలి. అదీ ఫ్యాషన్! నళినికి రేడియో పెట్టడం బాగా వచ్చును.

కాని, బామ్మకి నళినిని పాటపాడమనడం- పాట నేర్చుకోమని వేధించడం వచ్చును. నళినికి "పియ్యూసీ" "పార్టు" వుండిపోయింది. అంచేత ఈ ఏడాది ఆ అమ్మాయి ఇంట్లోనే వుండి పోయింది...నళినికి ఒక అన్నయ్య వుండేవాడు--మరే..."వుండేవాడు" అంటే అర్థం "యిప్పుడు లేడని కాదు. ప్రస్తుతం ఇంట్లో లేడని తాత్పర్యం. వాల్తేర్‌లో పెద్ద బళ్లో చదువుకుందికి వెళ్ళేడా అబ్బాయి ఒక 'గది' అతనికి ఆ ఇంట్లో కేటాయింపుగా వుండేది. ఆ గది యిప్పుడు ఖాళీగా వుంది. నళినీ వాళ్ళ నాన్న గారు ఆ గది అద్దెకిద్దామా అని గట్టిగానే అనుకుంటున్నాడీ మధ్యన.

సుబ్బారావుకి ఉద్యోగం యిచ్చిన కంపెనీలోనే ఒక గురవయ్యగారున్నారు. అతనికి నళిని "ఫాదర్' మనసులోని ఉద్దేశం బాగా తెల్సును. ఎందుకంటే, ఆ యిద్దరూ చతుర్ముఖ పారాయణం 'ఫ్రెండ్సు' పైగా, గురవయ్యానోరూ, అలాగే సుబ్బారావు అదృష్టమూ రెండూ మంచివి అవడం మూలానా-అతని సిఫార్సు మీద నళిని వాళ్ళ ఇంట్లో ఖాళీగా వున్న మెట్ల మీద గదిలో సుబ్బారావు అద్దెకి దిగి పొగలిగాడు.

సుబ్బారావుతోపాటు, ఆవకాయా, ఆవునెయ్యీ, నీరుల్లిపాయలూ(కొన్ని పాయలలో

ఉల్లిమొక్కలు కాడలై మొలిచె నహో!) కూడా ప్రవేశించాయి.

నళిని సుబ్బారావుని చూడలేదని సుబ్బారావు అనుకున్నాడుగానీ, నళిని సుబ్బారావునీ, సుబ్బారావు సామానులో వున్న ఆవకాయ వూటతో సహా- చూడగలిగిందనీ-వాళ్ళ బామ్మ కొక్కర్తికే తెలుసు.

ఆవిడ వెంటనే కోప్పడే మనిషి కాదుగనుక నళినికేసి చూసి, "రెండు జెడలు వేసుకుంటేనేగాని నీకు మొగుడు రాడని బెంగటే?" అని అడిగింది.

నళిని మొహం ముడుచుకుని, "అలా అయితే అసలు నాకు పెళ్ళే అక్కరలేదు పో" అంది. "అవ్వ!" అన్నది వాళ్ళ బామ్మ నోరు నొక్కుకుని.

నళిని రెండు జెడలలో ఇంత "విప్లవగాథ" వుందని తెలయని సుబ్బారావు బుద్ధిగా ఆఫీసుకు, అక్కణ్ణించి కాఫీ హోటేలుకు-ఆ తర్వాత తిన్నగా భోజనం హోటేలుకు కూడా వెళ్ళి, రెండు రోజులు ఎలాగో ఏదో తిని, నేరుగా 'రూమ్'కి వచ్చేవాడు. మూడో రోజున ఉదయం తొమ్మిదిన్నర గంటలకి నళిని కూనిరాగాలు తీస్తూ, వాళ్ళ "దోడ్లో బాత్‌రూమ్‌లో స్నానం-వేణ్ణీళ్ళతో స్నానం- చేస్తోంది. వాళ్ళ బామ్మ రోట్లో పప్పుపచ్చడి రుబ్బుతోంది. అదే సమయానికి అద్దంలో చూసుకుని ఆరోసారి క్రాఫింగ్ దువ్వుకుంటున్న సుబ్బారావుకి 'టక్కు'న ఓ సంగతి జ్ఞాపకం వచ్చింది.

వెంటనే హోల్డాలు పక్కనే వున్న సజ్జకేసి భయంగా చూశాడు. ఉల్లికాడలు తొంగిచూశాయి ప్రక్కనే వున్న జాడీ మూత ఎత్తాడు. ఆవకాయ 'ఎర్ర'గా చూసింది. నోరూరింది పాపం-సుబ్బారావుకి! సీసాలో నెయ్యి బూజుపడుతోంది. ఆవకాయని ఒక గ్లాసులోకి తీసుకుని కాస్త హోటలుకు పట్టుకెళ్తే?...సుబ్బారావుకి ఆలోచనలు మెరుపుల్లా వస్తాయికానీ పిడుగుల్లాంటి అనుమానాలు కూడా వాటిని తరుముతాయి.

"నళిని చూస్తుందో ఏమో?" అని భయం వేసింది. "వీడెడ్రా వీడూ? ఆవకాయ, ఆవునెయ్యీ, ఉల్లిపాయా అన్నీ తీసుకుని హోటలుకి పోతున్నాడూ" అనుకుంటుందేమో ఆ పిల్ల అనుకున్నాడు సుబ్బారావు (వంటరాకపోతే అంతే' ననికూడా అనుకుంటుందేమో) మరి మన సుబ్బారావు అవన్నీ హోటలుకి మోసుకుపోతే "తీసుకుని వెళ్లాడు" అనుకోక "తీసుకెళ్ళలేదూ" అని ఎలా అనుకుంటుంది?

కాని, ఆ సమయంలో సుబ్బారావుకి తర్కమే అసలు తలకెక్కలేదు. ఏమైనా నళిని-రెండు జెడలు వేసుకొనేనళిని-హిందీ సినిమా పాటలు గొణిగే నళిని-చూస్తూ వుండగా, ఆవకాయకాదు కదా, ఒక్క నీరుల్లిపాయ జేబులో వేసుకుని కూడా, మేడమెట్లు దిగలేను అని ఒప్పేసుకున్నాడు సుబ్బారావు- అద్దంలో తనకెప్పుడూ అందంగా అగుపించే తన ప్రతిభింబం ఎదుట నిలబడి!

ఆ విధంగా సుబ్బారావు ఆవకాయనూ, ఆవునెయ్యినీ, కందిపొడినీ, కొరివికారాన్నీ, అన్నింటినీ 'రూమ్'లోనే భద్రంగా వదలి దీనంగా మెట్లు దిగుతుండగా, స్నానం పూర్తి చేసుకుని పరికిణీ, వోణీ వేసుకుని, అలా పెరట్లోంచి వస్తూ, యిలా ఇంట్లోకి పారిపోతున్న నళిని ఓ చూపు చూసింది! దాంతో

సుబ్బారావు దీనవదనం చెంపదెబ్బ కొట్టినట్లు చైతన్యవంతమైంది.

ఇంకా నయం. ఆవకాయ లేదు చేతిలో ననుకున్నాడు-దిగి నేరుగా ఆఫీసుకి వెళ్ళిపోయాడు (భోజనం మాట మరిచిపోయి)

అలా నాలుగు రోజులు ఉత్తచేతులతో వెళ్లి హోటలులో తిండీ, ఆఫీసులో పనీ చేతకాక, చీవాట్లు తినేసరికి, సుబ్బారావుకి "నాలికమీద", గెడ్డంమీద కూడా వెంట్రుకలు మొలిచాయి.

అబ్బ! నాకీ నూనె- "రీఫైన్డ్ ఆయిల్" అయినా పడదు-నాకీ పచ్చడి 'చెట్నీ' అనబడినా కిట్టదు' అనుకున్నాడు కాని, ఏం చేస్తాం ? రూమ్‌లో అన్నీ వుండి ఏమీలేని వాడయ్యాడు సుబ్బారావు. నీరుల్లిపాయల సజ్జలో ఎలుకలు వచ్చి కాపురం పెడుతున్నాయిగనుక సజ్జతోసహా అవతల పారేశాడు (విధి బలీయంకదా!) కాని, చూస్తూ చూస్తూ కాస్త వేలితో తీసి, 'నాకి'న తర్వాత కూడా, ఆవకాయనూ, ఆవునెయ్యినీ ఎలా పారేయడం? కానీ సుబ్బారావు చురుకైన వాడనీ, వట్టభద్రుడనీ ముందే చెప్పానుకదా! ధైర్యంకోసం వాళ్ళమ్మ రాసిన ఉత్తరం చదువుకున్నాడు మరో సారి!

"బాబూ! ఆశీస్సులు! ఎలా వున్నావో? యేమో! నీవు ఆ దంపుడు బియ్యం కాకపోతేమానె కాసిన్ని ఓ పావు మూట మరబియ్యమైనా నీతో పట్టుకుపోకపోతివేనని" ఆమె బాధపడుతూ రాసింది.

ఆ వేళ ఆఫీసులో సుబ్బారావుకి పని తోచలేదు. వంట బుర్రలోకి ప్రవేశించింది. నళిని కూడా గుర్తుకి రాలేదు. ఎంతసేపూ భోజనం . ముఖ్యంగా వేడి వేడి అన్నం, నెయ్యి, కందిపొడుం, ఆవకాయ లాంటి తెలుగుమాటలన్నీ బుర్ర దొలిచేస్తున్నాయి. అవి తలలోంచి చేతిమీదుగా కలంలోకి దూరి, కాయితం మీదికి 'నల్లగా జారిపోతాయేమోనన్న భయంతో!ః ఎట్టకేలకు సుబ్బారావు ఒక నిర్ణయం చేసుకున్నాడు. "నేను వండుకుంటాను" అనుకున్నాడు.

"ఏం కావాలి వండుకోడానికి?" మొదటిది వంట రావాలి. అది సుబ్బారావుకి రాదని ఏ చరిత్రకారులేనా రాస్తే, వాళ్ళని గుండేసి కొట్టినా పాపం లేదు. సుబ్బారావు భీముడు కాకపోయినా నలుడు కాగల్డు.

తిన్నగా మేనేజర్ దగ్గరకెళ్ళి, "సర్! ఐవాంట్ లీవ్" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు మేనేజర్. "వంట వండుకోవాలి" అనేసి, నాలిక్కర్చుకున్నాడు సుబ్బారావ్. ఆ మేనేజర్ తెల్లబోయి, "వ్వాట్?" అన్నాడు. సుబ్బారావు సిగ్గుపడుతూ, "నేను నా రూములోనే వంట పెట్టుకొని, భోజనం చేస్తాను సార్! ఈ హోటలు తిండి నాకు పడటం లేదుసార్. అలా అని మా అమ్మ లెటర్ కూడా రాసింది." అన్నాడు. సుబ్బారావు తెగువకి మేనేజరు తెలుగులోనవ్వేసినా, లీవ్ ఇంగ్లీష్‌లో 'గ్రాంట్ చేశాడు.

"ఇక నళిని తనను చూసి నవ్విపోదు" అని సుబ్బారావు ధైర్యపడ్డాడు.

* * *

తక్షణం ఒక జనతాస్టౌ కొన్నాడు. రెండు హిండాలియం గిన్నెలు, ఒక గరిటె కొన్నాడు. నలుడైపోయిన సుబ్బారావు. తను ఆవకాయ, ఆవునెయ్యీ తినాలంటే, స్వయంపాకం సుబ్బారావుకీ, అతనిలోని భోజన ప్రియత్వమనే కళాత్మకమైన అభిరుచికీ కూడా అప్పట్లో అత్యవసరంగనుక, ఈ వస్తువులు వెంటనే కొన్నాడు. కానీ కిరసనాయిలు మర్చిపోయాడు. అగ్గిపెట్టె-బీడీల అలవాటు లేక కొనుక్కోలేదు. ఒక స్టీలు గ్లాసూ, టిఫిన్ క్యారియర్‌లోని అయిదు గిన్నెలూ రూంలో వున్నాయి. ఫర్వాలేదని ఆలోచించాడే తప్ప, మూకుడూ, దాంతో అట్లకాడా పొయ్యిలోకి ఇంధనంలేని వంటసామగ్రి నశేషమని తెలుసుకోలేకపోయాడు సుబ్బారావు (తాత్కాలికంగా).

అంచేత, ఆ రాత్రి మళ్ళీ సుబ్బారావు హోటలుకే వెళ్ళవలసివచ్చింది. వెళ్తుండగా నళిని కనిపించింది-పోనీ వీళ్ళను కాస్త కిరసయాయిలూ, అగ్గిపెట్టే ఎరువు అడగనా? అనుకున్నాడు సుబ్బారావు. కానీ, చూస్తూ చూస్తూ, రెండు జడలు వేసుకున్న ఆడపిల్లను ఎలా అడగటమా? అని సంకోచిచాడు. కాని సుబ్బారావు గట్టివాడని మనకు తెల్సు. ముఖ్యంగా యిలాంటి విషయాల్లో హరిబ్రహ్మాదులు అడ్డువచ్చినా అనుకున్న పని చేసి తీరుతాడు. కావున, అడ్డంగా వచ్చిన నళినిని అడిగి తీరాలి అనుకున్నాడు. అది గమనించిన నళిని కూడా" ఏం కావాలండీ"అంది కమ్మగా...

"కిర్సనాయిలు"! అంటూ పెదాలు తడుపుకున్నాడు.

"ఎంత కలి కాలమయినా, మగాడికి కిరసనాయిలెందుకూ?" అందుకే నళినికి ఆశ్చర్యంతోపాటు కాస్త భయంకూడా వేసింది. కాని, తెలివైంది కనుక, "కరెంట్ పోతే కొవ్వుత్తులున్నాయిగా, యిస్తానం'ది జాలిగా.

"కాదు కరెంట్ వుంది! వండుకుందామని కిర్సనా...." సుబ్బారావునిక ఎవ్వరూ అడ్డలేరు. కాని, మాట పూర్తి కాకముందే నళిని పారిపోయింది! భయమో, ప్రేమో అనుమానమో, అదొక శృంగారచేష్ట విశేషమో, లేక తెలుగు పాఠమో తెలియని సుబ్బారావు కూడా అంతకంగారూ పడిపోయాడు.

నళిని వెళ్ళి వాళ్ళ బామ్మను పంపింది. కాని అంతలో కంగారుపడిన సుబ్బారావు హోటలుదాకా వెళ్ళిగానీ తిరిగి చూడనేలేదు.

వాళ్ళ బామ్మ నళినిని పిలిచి, "ఏమే! నీవు పెంకితనం చేస్తున్నావా? లేక ఆ కుర్రాడు వేషాలేస్తున్నాడా? చెప్పు. కిర్సనాయిలెందుకూ అతగాడికీ? ఏడీ; ఎక్కడున్నాడటా?" అని గుడ్లురిమింది.

నళిని నవ్వి, అంతలో ఏడుపు మొహం పెట్టి "నీమీద ఒట్టు బామ్మా! ఆ అబ్బాయి వొండుకోడంకోసం కిర్సనాయిలే అడిగాడే" అంది.

"వొండుకుంటాడా? అయితే 'వొడ్లు' కావాలేమోనే పిచ్చి పిల్లా!... పోన్లే రేపు యిద్దాం" అంది ఉదారంగా బామ్మ.

అయితే పౌరుషంగల సుబ్బారావుకు ఆ "రేపు"రోజున కిర్సనాయిలు, వడ్లులాంటివి ఒకర్ని అడిగే అవసరమేలేదు. అన్నీ స్వయంగా తెచ్చుకున్నాడు. తన గదిలోనే ఒక ప్రక్క కాలువ కన్నం వున్న

దగ్గర 'స్టౌ' పెట్టాడు. పప్పూ, ఉప్పూ' అన్నీ చిన్న పోపులపెట్టె లాంటి దాంట్లోనే అమర్చాడు. నళినిగారింట్లో పనిచేసే 'గంగాయమ్మ జాలిపడి, 'ఎందుకుబాబూ మీకీశ్రమ! కావాలంటే క్రింది బామ్మగారు మడీగా వండిపెడతారు. తినరాదా? నేను చెప్పనా ఏంటి?" అని అడిగింది. కానీ, సుబ్బారావు తెలుగులో "విశ్వస్థవడ్డించినా, వెల్లుల్లి వేసినా తినడానికి నేను శ్రీనాథుణ్ణికాను గంగాయమ్మా!' 'అన్నాడు. 'నాకు వంట వచ్చున్‌గా" అనికూడా ప్రకటించాడు.

"సరే మీఇట్టం" అంది గంగాయమ్మ "పిచ్చికాబోలు" అని స్వగతం పలుక్కుందికూడా!

క్యారియర్ గిన్నెలతోను, సిల్వర్ మూకుడుతోనూ, మొత్తం మీద సుబ్బారావు అన్నం, కూరా చేసుకున్నాడు. బంగాళాదుంపలు తొక్క తీయకుండా, బ్లేడుతో తరిగి ఆవు నెయ్యితో వేపడం చేసుకున్నాడు!

మధ్య మధ్య కాస్త చెయ్యి కాల్చుకున్నాడు కానీ, మరీ అంత ప్రమాదంలేదు. ఆవకాయలో అన్నం నంచుకుని '(కాస్త అన్నం చిముడు చిముడుగా వుంది మరి) కూర ముక్కలకి ఉప్పు అద్దుకుని (మొదటి వేయడం మర్చిపోయాడు-మరి కొత్త కదూ!) తిని, వెంటనే పరిగెత్తి ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

కాని, అరగంట ఆలస్యమయిందని మెమో ఇచ్చాడు వాళ్ళ మేనేజర్. (ఛీ, ఛీ సుబ్బారావు ఎంత పాకశాస్త్ర వీరుడో బొత్తిగా తెలియని మేనేజర్)

నళిని, సుబ్బారావు వంట ఉద్యమం అంతా గంగాయమ్మ ద్వారా విన్నది. కుతూహలం, సంతోషం, జాలీ వంటివన్నీ ఆ పిల్ల మనసుని పెనవేశాయి. అద్దంలో చూసుకుంటూ కూడా, రెండు జెడలకు బదులు, పరధ్యానంలో ఒక్క జడవేసుకుని, తిన్నగా బామ్మ కంటబడకుండా డాబా మీదకు వెళ్ళి సుబ్బారావు గది కిటికీలోనుండి చూసింది. "నిజంగా వండుకుంటున్నాడు! పైగా నీటుగా వండుకుంటున్నాడుకూడా" అని మనసారా మెచ్చుకుంది. "డిగ్రీ పుచ్చుకుని కూడా వంటచేయగలగటం ఎంత బాగుంది" అని ఆశ పడ్డది. "ఛి ఛీ! నాకు బామ్మ అంటూన్నట్లు రెండు జెడలు వేసుకోడం తప్ప వంట కూడా రాదూ" అని బాధపడింది. పోనీ సుబ్బరంగా సుబ్బారావులాంటి భర్త వస్తే హాయిగా, తీరిగ్గా రెండు జెడలే వేసుకొంటూ వుండవచ్చునని కూడా ధైర్యపడింది. నేరుగా క్రిందికి వెళ్ళి "బామ్మా! నువ్వ స్వార్థపరురాలివి" అంది గట్టిగా.

"ఏం జరిగిందే, లక్ష్మిదేవీ?" అన్నది వాళ్ళ బామ్మ మడిగా, దూరంగా నుంచొని.

"మడీ మడీ అంటూ ఆఖరికి నాకు వంటకూడా నేర్పలేదు" అంది నళిని కోపంగా.

అదా, నీ బెంగ? వంటదేం భాగ్యమే పిల్లా! రెండు జెడలు నేను నేర్పేను గనుకనా వంట నేర్పడానికి? అది మీ అత్తగారింట నేర్చుకుందువు గానిలే" అని ధైర్యం చెప్పింది బామ్మ.

"ఊహూఁ నేను నేర్చుకోను' అంది నళిని

"సరే! మీనాన్న ఓ వంటవాణ్ణి చూసి తెస్తాడులే!" అంది బామ్మ బోలెడు నవ్వి. నళిని

పారిపోయింది.

ఆ పారిపోవటంలో నళిని చాలా దూరదృష్టితో పారిపోయింది. ఆ వంటవాడూ, ఆ నలుడూ సుబ్బారావే అయితే ఎంత బాగుండును! హాయిగా దమయంతిలా...కాని సుబ్బారావు పెళ్ళి చేసుకున్నాక వంట మానేస్తాడేమోనని భయం వేసింది అంతలోనే...

నళిని వెంటనే వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి, "అమ్మా" అన్నది ఆత్యవసరంగా. వాళ్ళమ్మ వెంటనే "పాపం! మన ఇంట అద్దెకు తిగిన అబ్బాయి చెయ్యి కాల్చుకుంటున్నాడటగా" అంది.

"ఔను. నన్నే అగ్గిపెట్టి అడిగాడు" అంది నళిని.

"ఓసి నీ ఇల్లు బంగారం గానూ" అంది వాళ్ళమ్మ. అని మళ్ళీ కూతురు తల నిమిరి, "మన వాళ్ళ అబ్బాయేనట పాపం! బుద్ధిమంతుడు కాపోతే ఈ రోజుల్లో కూడా, స్వయంపాకం చేసుకుంటాడా?' ' ఆశపడ్డది

"పాపం! వంట చేసేవాళ్ళు లేరుకాబోలే' అంది నళిని.

'మీ నాన్నగారితో చెప్పనా?" వాళ్ళమ్మ మాటలకు నళిని ఆశ్చర్యపోయి అంతలో తేరుకుని తుర్రుమని పారిపోయింది.

నేరుగా బామ్మ దగ్గరికెళ్ళి, "బామ్మా! నేను వంట నేర్చుకోను" అని గట్టిగా అరిచి, గదిలోకి పారిపోయి, మంచంమీదికి గెంతి, "కల నిజమాయెగా...'అంటూ కాళ్ళు ఎగరేస్తూ పాడుకుంది. అలాగే నిద్రపోయి, కలలో ప్రేమలోపడి, సుబ్బారావు వంట అతను తినిపించగా, రుచి చూసింది కూడా!

* * *

కాని ఏం చేస్తాం? కథల్లో విలన్లు ప్రవేశిస్తారుగా! కథ వంటతో ప్రారంభించి పెళ్ళితో ముగిస్తే రుచిబాగుండునుగానీ, సుబ్బారావులాంటి వంట వండుకుని తినేటంత చాదస్తం వున్నవాడికి, ఆఖరికి హోటల్‌లోనైనా తినడం రానివాడికి-'పిల్లనుయివ్వను గాక యివ్వను " అన్నాడు నళినీ వాళ్ళ నాన్నగారు. నళిని "ఈ విలన్ లాంటి నాన్నలున్నంతకాలం ఆడపిల్లలు వంటలు, ఆఖరికి వారపత్రికలు చదివి ఐనా నేర్చుకోవలసిందే"నని పశ్చాత్తాపపడిపోయింది. విధిని తిట్టుకుంది.

"ప్చ్! ప్చ్!! ఏం చేస్తాం? నళిని నాన్నగారలాంటివాడుః కాని, నళినికి మాత్రం సుబ్బారావు మీద ఆశ అదే ప్రేమ పోలేదు-'వంట'పైగా బామ్మ 'మడివంట' అంటేనే ఆ పిల్లకి మరీ అయిష్టమైపోయింది. తన ప్రేమ గాథ విషాదగాథ కాకుండా రక్షించే దేవుడెవరా! అని అలా చూస్తోంది.

(ఆంధ్రపత్రిక వారపత్రిక 1964)